సాక్షి సంగారెడ్డి

మంగళవారం : 30 : మే : 2023



సరిహద్దులో చెక్‌పోస్ట్

కర్ణాటక, మహారాష్ట్ర నుంచి రాష్ట్రంలోకి నకిలీ విత్తనాలు వచ్చే అవకాశం ఉందనే అనుమానంతో మొగుడంపల్లి మండలం మాడ్గి వద్ద ప్రత్యేక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. 8లో



సహజ వనరులను..

రోజురోజుకీ పెరుగుతున్న వాహన కాలుష్యం నిరోధించాలంటే సీఎన్జీ వినియోగం పెరగాల్సిన ఆవశ్యకత ఉందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. 9లో

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి లో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 14 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 15 మందికి చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారానికి కృషి

- రీజినల్ పీఎఫ్ కమిషనర్ విశాల్ అగర్వాల్



పెన్షన్ పత్రాల పంపిణీలో రీజినల్ పీఎఫ్ కమిషనర్ విశాల్ అగర్వాల్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భవిష్యనిధి సంస్థ ప్రతీనెల నిర్వహించే నిధి ఆప్ కే నికత్ 2.0 కార్యక్రమాన్ని సోమవారం భారతినగర్ డివిజన్ పరిధి విద్యుత్‌నగర్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి రీజినల్ పీఎఫ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ హాజరై మాట్లాడారు. ప్రతీ నెల ఈపీఎస్ చందాదారులు, పెన్షన్‌దారుల సమస్యలను పరిష్కారించేందుకు ఈ శిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో వారి సమస్యలను పరిష్కారిస్తున్నామన్నారు. ప్రయాస్ పథకంలో భాగముగా మేలో వివిధ పరిశ్రమలు, సంస్థల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చెందిన 25 మంది పెన్షన్‌దారులకు పెన్షన్ మంజూరు చేసినట్లు తెలిపారు. 13 మందికి పత్రాలు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ ఆర్.శ్రీదేవి, అధికారుల జీవి రావు, బబుల్ నాథ్ నాయక్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, నాయకులు

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రతీపల్లె ప్రగతికి నిదర్శనంగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో రూ.9 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత మురుగు నీటి కాల్వల నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తూ పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామన్నారు. ప్రభుత్వం విడుదల చేసే నిధులతో పాటు వివిధ పరిశ్రమల సహకారంతో సీఎస్ఆర్ నిధులను కేటాయిస్తూ గ్రామాలను అభివృద్ధికి ప్రతీకలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు దశరథ రెడ్డి, వెంకట్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మధు, ఎంపీటీసీలు మంజుల శ్రీశైలం, మాధవి నరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ విష్ణు వర్ధన్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కొండాపూర్ (సంగారెడ్డి): ఐకేపీ వీఓఏలు తమ సమస్యలను పరిష్కరించాలని 42 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పరిష్కరించకపోవడంపై సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సాయిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐకేపీ వీఓఏల సమ్మెలో భాగంగానే సోమవారం హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద మహాధర్నాకు పిలుపునిచ్చారన్నారు. అయితే ఈ ధర్నాకు పోలీసులు అనుమతి ఇచ్చినా ధర్నాకు వెళ్లకుండా సంగారెడ్డి జిల్లాలో సీఐటీయూ నాయకులను, ఐకేపీ వీఓఏలను హౌస్ అరెస్ట్ చేయడం సరికాదన్నారు. అరెస్ట్ చేసిన నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నేడు జాబ్ మేళా

సంగారెడ్డి టౌన్: జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో నేడు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా ఉపాధి అధికారి వందన సోమవారం తెలిపారు. అపోలో ఫార్మా కంపెనీలో 150 పోస్టులు భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ అర్హత అభ్యర్థులు పూర్తి సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు. 10 వేల నుంచి 25 వేల వరకు జీతం ఉంటుందన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన వారు పాత తెలుగు ఆఫీస్ లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 11 గంటల వరకు రావాలని సూచించారు.

పీడీ యాక్ట్ నమోదు చేయాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): నకిలీ విత్తన వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలనీ బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి సత్యనారాయణ గౌడ్ సోమవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సదాశివపేట ప్రాంతంలో ఇటీవల రూ.కోట్లు విలువ చేసే నకిలీ విత్తనాలు, పురుగుల మందులు పట్టుబడినా అధికారుల చర్యలు శూన్యమని ఆరోపించారు. వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో నకిలీ విత్తనాలు, పురుగుల మందులను విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వెళ్లి.. గొర్రెలు కొనుక్కురండి

- 19 శాఖల జిల్లా అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు
- కొనుగోలు బాధ్యతల నుంచి వెటర్నరీ డాక్టర్ల తొలగింపు
- దశాబ్ది ఉత్సవాల్లో రెండో విడత పంపిణీకి ఏర్పాట్లు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రెండో విడత గొర్రెల కొనుగోలు బాధ్యతలను ప్రభుత్వం జిల్లాలోని వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులకు అప్పగించింది. తొలి విడతలో పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు, వెటర్నరీ వైద్యులు ఈ గొర్రెలను కొనుగోలు చేశారు. ఈసారి ఇందుకు భిన్నంగా పలు శాఖల జిల్లా ఉన్నతాధికారులతో వీటిని కొనుగోలు చేస్తోంది. తొలివిడత గొర్రెల కొనుగోళ్లలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయి. దళారులు, వెటర్నరీ అధికారులు కుమ్మక్కయి గొర్రెలను కొనుగోలు చేయకుండానే, చేసినట్లు రికార్డులు చూపి నిధులను డ్రా చేశారు. ఒకే యూనిట్ గొర్రెలను రెండు, మూడు యూనిట్లుగా చూపి సొమ్ము చేసుకున్నారు. ఈ రెండో విడతలో ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం జిల్లాలోని పశు సంవర్ధకశాఖ అధికారుల ప్రమేయం లేకుండా జిల్లాలోని 19 శాఖల ఉన్నతాధికారులతో ఈ కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని నిర్ణయించింది. వీరు లబ్ధిదారులను ఆయా రాష్ట్రాలకు తీసుకెళతారు. పశు సంవర్ధకశాఖ రాష్ట్ర ఉన్నతాధికారి పర్యవేక్షణలో గొర్రెలను కొనుగోలు చేసి తీసుకురానున్నారు.

బెల్‌గాం, చంద్రాపూర్, ప్రకాశం, ప.గో ప్రాంతాల్లో..

- తొలి విడతలో అనంతపురం, కడప, ప్రకాశం ప్రాంతాల్లో గొర్రెలను కొనుగోలు చేసి తెచ్చారు. ఈసారి కర్నాటకలోని బెల్గాం, మహారాష్ట్రలోని చంద్రపూర్, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో గొర్రెలను కొనుగోలు చేసి తీసుకురావాలని నిర్ణయించారు.
- ఈనెల 3వ తేదీన ఆయా శాఖల అధికారులు లబ్ధిదారులను తీసుకుని ఈ ప్రాంతాలకు వెళ్లి గొర్రెలను తీసుకురానున్నారు.
- తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో వీటిని లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. ఈ గొర్రెలను నేరుగా ఆయా నియోజకవర్గ కేంద్రాలకు తరలించి ఎమ్మెల్యేతో పంపిణీ చేయనున్నారు.

పెరిగిన యూనిట్ వ్యయం..

- గొర్రెల యూనిట్ వ్యయాన్ని ప్రభుత్వం పెంచింది. గొర్రెల ధరలు బాగా పెరగడంతో ప్రభుత్వం యూనిట్ వ్యయాన్ని పెంచింది.
- తొలివిడతలో రూ.1.25 లక్షలు ఉన్న యూనిట్ వ్యయం, ఇప్పుడు రూ.1.75 లక్షలకు పెంచింది. ఇందులో లబ్ధిదారులు రూ.43,750 చెల్లించాల్సి ఉండగా, మిగతా రూ.1,31,250లు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది.
- తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం, ఈ ఉత్సవాల్లో భాగంగా గొర్రెల పెంపకందారులకు సబ్సిడీ గొర్రెలను పంపిణీ చేయాలని నిర్ణయించింది.
- ఈ రెండో విడతలో జిల్లాలో 3,995 మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను పంపిణీ చేయనున్నారు. జిల్లాలో మొత్తం 31,028 మంది గొర్రెల పెంపకం దారులు ఆయా సొసైటీల్లో సభ్యులుగా ఉన్నారు.
- తొలి విడతలో 19,203 మందికి గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. మిగిలిన 11,825 మందిలో లబ్ధిదారుల వాటాకు సంబంధించిన డీడీలు చెల్లించిన 3,995 మందికి ఈ దశాబ్ది ఉత్సవాల్లో పంపిణీ చేస్తారు.

పండగలా దశాబ్ది ఉత్సవాలు

కలెక్టర్ శరత్



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను పండగలా ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2 నుంచి 22 వరకు నిర్వహించ తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై సోమవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లు, అన్నిశాఖల అధికారులతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు చేపట్టిన చర్యలపై జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శరత్ మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాలకు సంబంధించి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. రోజువారీ కార్యక్రమాల నిర్వహణకు ఆయా శాఖల అధికారులతో కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో అన్ని రైతు వేదికలలో రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని, హరితోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విరివిగా మొక్కలు నాటేలా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఎస్పీ రమణకుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఓ నగేష్ పాల్గొన్నారు.

పది కాలాల పాటు గుర్తుండేలా..

పది కాలాల పాటు గుర్తుండేలా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉత్సవాల ఏర్పాట్లపై ఎస్పీ రమణ కుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. జూన్ 2 వ తేదీన రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు ప్రారంభమై జూన్ 22న అమరుల సంస్మరణ దినోత్సవంతో పూర్తవుతాయన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటమే టీపీటీఎఫ్ ఎజెండా

టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్



టీపీటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి రాంచందర్

కొండాపూర్(సంగారెడ్డి): విద్యారంగ, సామాజిక సమస్యల ఎజెండాతోనే టీపీటీఎఫ్ (తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్) పోరాడుతుందని, అందరికీ విద్య, అందరికీ వైద్యం ఇవి పేదలకు అందిన నాడే సమాజం నిజమైన ప్రగతి సాధిస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ పేర్కొన్నారు. టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలోని ఉపాధ్యాయ భవన్ వద్ద టీపీటీఎఫ్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1983 నుంచి తెలంగాణలో టీపీటీఎఫ్ విద్యారంగ సమస్యల సాధన కోసం ఐఖియా మహాసభలు, ఫ్యాప్టో సమ్మె, రిలే నిరాహార దీక్షలు, చలో రాజభవన్, పాతిక వేల సంతకాలతో మహా ప్రదర్శన, విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించాలని విద్యా మహాసభలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ సంజీవయ్య, ఖంరోద్దీన్, సీనియర్ నాయకులు భూమి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు విజయ భాస్కర్, మర్రి ప్రశాంతి, జిల్లా కార్యదర్శులు అశోక్ కుమార్, మల్లికార్జున్, ఆడిట్ కమిటీ కన్వీనర్ జగన్నాథం, సభ్యుడు సంతోష్ కుమార్, సోషల్ మీడియా కమిటీ సభ్యులు పుండరీకం, సాంస్కృతిక కమిటీ కన్వీనర్ హేమలత, అకాడమిక్ సెల్ కన్వీనర్ సాయిలు దారి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే సీజన్‌కు అప్రమత్తంగా ఉండాలి



పుష్పగుచ్ఛం ఇస్తున్న విద్యుత్ సిబ్బంది

జెన్‌కో సీఈ రమేశ్‌బాబు

పుల్‌కల్(అందోల్): వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని పోచంపాడ్ విద్యుత్ డివిజన్ సీఈ రమేశ్‌బాబు అన్నారు. సోమవారం సింగూరు విద్యుత్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పోచంపాడ్ విద్యుత్ డివిజన్ పరిధిలోకి పోచంపాడు, నిజామాబాద్, పెద్దపల్లి, సింగూర్ విద్యుత్ కేంద్రాలు వస్తాయి. ఈ నాలుగు విద్యుత్ కేంద్రాలకు చీఫ్ ఇంజినీర్ ఒక్కడే కావడంతో విధి నిర్వహణలో భాగంగా సింగూరు విద్యుత్ ప్లాంట్‌ను సందర్శించి పరిశీలించారు. వేసవిలో విద్యుత్ ఉత్పత్తి లేకపోవడంతో యంత్రాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని ఇంజినీర్‌లకు సూచించారు. వర్షాకాలం ప్రారంభం నుంచి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈసారి రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసినందుకు విద్యుత్ కేంద్రం సిబ్బందికి అభినందించారు.

కేతకిలో భక్తుల పూజలు



పూజ చేస్తున్న దంపతులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయంలో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ఆలయ ఆవరణలోని అమృతగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి గుండంలోని జల లింగానికి పూజలు చేశారు. గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

మొత్తం 39 దరఖాస్తులు స్వీకరణ



అర్జీదారులతో మాట్లాడుతున్న అధికారి

సంగారెడ్డి టౌన్: ప్రజావాణిలో అందజేసిన ఫిర్యాదులపై సత్వర పరిష్కరిష్కారంపై దృష్టి సారించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 39 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పలువురు అర్జీదారుల నుంచి గ్రీవెన్స్ హాల్లో రెవెన్యూ డివిజనల్ అధికారి అంబదాస్ దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణికి మొత్తం 39 అర్జీలు రాగా అందులో 12 రెవెన్యూ, 27 ఇతర శాఖలకు సంబంధించినవని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఐలాపూర్‌లో ఇల్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలిని ఐలాపూర్ గ్రామస్తులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే మల్కాపూర్ చింతల్‌లోని నవజీవన్ కాలనీలో మంచినీటి కనెక్షన్లు ఇప్పించాలని, తాగడానికి మంచి నీరు రావడంలేదని, నీటి సదుపాయం కల్పించాలని కాలనీ వాసులు దరఖాస్తు అందజేశారు.

కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా

నాకున్న పట్టా భూమిలో కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని పలుమార్లు మండల, జిల్లా కార్యాలయంలో ఫిర్యాదుచేశారు. ఎటువంటి ప్రయోజనం లేకుండాపోయింది. ఇప్పటికైనా అధికారులు నాయందు దయచూపి నాకు న్యాయం చేసి పట్టా భూమిని కబ్జాదారుల నుంచి రక్షించాలి.

– జంగం మల్లికార్జున్ ధనసిరి గ్రామం, మొగుడంపల్లి మండలం

ట్రై సైకిల్ ఇప్పించాలి

నేను నడవలేని స్థితిలో ఉన్నాను. ఎటువంటి పనిచేయడం లేదు. ప్రయాణం చేయడానికి ఇబ్బందిగా ఉంది. అధికారులు ట్రై సైకిల్ ఇప్పిస్తే పనిచేసుకుంటాను.

– రాములు, చింతల్ ఘాట్ గ్రామం, కోహీర్ మండలం

డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేయాలి

గత కొన్ని సంవత్సరాలుగా కిరాయి ఇంట్లో ఉంటున్నాం. అద్దె కట్టలేకపోతున్నాం. నిరుపేదల కోటాలో ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయాలి.

– రెహనా బేగం, అందోల్ మండలం

కొనుగోలు, అమ్మకాలకు అవకాశం కల్పించాలి

మా భూములు ధరణి పోర్టల్లో వక్ఫ్ భూములుగా చూపుతున్నాయి. అందులో మేము కొనుగోలు చేసినవి, అనువంశికంగా పొందిన భూములు ఉన్నాయి. తెలంగాణ ప్రాంతంలో ఇనాం భూములు రద్దు చట్టం ద్వారా ఇనామ్ ఫైనల్ పట్టా ఇచ్చారు. ప్రభుత్వాలు కొత్త విధానాలు తీసుకురావడంతో మాకు తీరని అన్యాయం జరుగుతోంది. మా భూములు అమ్ముకునే విధంగా అవకాశం కల్పించాలి.

– కోహీర్ మండల రైతులు

పార్లే ఆగ్రోతో మెరుగైన వేతన ఒప్పందం

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య

పటాన్‌చెరు టౌన్: కార్మికుల ఐక్యతతోనే పార్లే అగ్రో పరిశ్రమతో మెరుగైన వేతనం ఒప్పందం జరిగిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కార్మిక సంఘం అధ్యక్షుడు రాజయ్య అన్నారు. మండలంలోని పాశమైలారం పార్లే అగ్రో పరిశ్రమలో సోమవారం డీసీఎల్ రవీందర్ రెడ్డి సమక్షంలో వేతన ఒప్పందం పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడారు. కార్మికుల ఐక్యతతో మంచి వేతన ఒప్పందం సాధించామన్నారు. కార్మికులు ఐకమత్యంగా ఉండటం వల్లే ఇది సాధ్యమైందన్నారు. సీఐటీయూ వచ్చిన తర్వా ఈ నాలుగేళ్లలో రెండు అగ్రిమెంట్ల ద్వారా రూ.19 వేలు పెరిగాయన్నారు. అగ్రిమెంట్‌కు సహకరించిన యజమాన్యానికి, కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమ జీఎం మల్లికార్జున్ రెడ్డి, హెచ్ఆర్ కరీం, యూనియన్ ఆఫీస్ బేరర్స్ సంతోష్ కుమార్, రాజశేఖర్, జంగయ్య, కిరణ్, సుధాకర్, సుజిత్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం

- పట్టించుకోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు
- స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అశ్రద్ధ
- ఆరునెలలైనా శుభ్రం చేయని వైనం
- స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌పై చర్యలు శూన్యం



పుల్కల్ మండలం కోడూరులో అపరిశుభ్రంగా ఉన్న మురుగు కాల్వ

సంగారెడ్డి మున్సిపాలిటీ: రానున్నది వర్షాకాలం. ప్రజలు సీజనల్ వ్యాధులకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇటీవలే జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈనెల 17 నుంచి 23 వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ శరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 647 గ్రామపంచాయితీలున్నాయి. జూనియర్ పంచాయతీల సమ్మె ఉండటంతో ఆ సాకుతో పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్యం పైదృష్టి సారించడం లేదు. కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు వినడం లేదని మమ్మల్ని ఏమి చేయమంటారని కుంటి సాకులు చెప్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలు బేఖాతర్

- స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని, ఆ దిశగా సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ ఆదేశించారు . గ్రామీణ ప్రాంతాల పారిశుధ్య పరిస్థితిని మెరుగుపరిచేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలన్నారు.
- జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో పారిశుధ్య సమస్యలను గుర్తించి, గ్రామసభ నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇందులో మురుగు కాల్వలు, రోడ్లను శుభ్రం చేయాలన్నారు. కానీ జిల్లాలో కొన్ని గ్రామాలు తప్ప ఎక్కడా పారిశుధ్య పనులు జరగలేదని ప్రజలు చెబుతున్నారు .
- రోడ్లపై చెత్తను తొలగించాలని, తాగునీటి పైపు లైన్ల లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేయించాలి. అయితే ఆ పనులు చేయకుండానే బిల్లులు డ్రా చేస్తున్నారని పలువురి నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి .
- ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్న అంశాన్ని అటకెక్కించారు.
- గ్రామాల్లో డంపింగ్ యార్డ్‌లు, వైకుంఠధామాలు, ప్రభుత్వ సంస్థలను శుభ్రం చేయాలని సూచించినప్పటికీ ఎక్కడా శుభ్రం చేసిన దాఖలాలు లేవని ప్రజలు చెబుతున్నారు.
- వినియోగంలోలేని పురాతన బావులు, పనికిరాని బోర్‌వెల్స్‌ను పూడ్చివేయాలని, నీటి నిలువ ఉండే ప్రాంతాలను, రోడ్లపై గుంతలను పూడ్చివేయాలని, తుప్పు పట్టిన, ఒరిగిన విద్యుత్ స్తంభాలను మార్చాలని, వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడం, బ్లీచింగ్ చల్లడం వంటి చర్యలు చేపట్టాలంటున్నారు.
- పంచాయతీ పాలక వర్గం మూడు నెలలకోసారి సమావేశాలు నిర్వహించి ప్రజలకు వ్యక్తిగత మరుగుదొడ్లు, వైకుంఠధామాలు తదితర అంశాలపై అవగాహన కల్పించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదు.
- సమావేశాలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పనులు చేయకుంటే చర్యలు తప్పవు

గ్రామంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ లో పనిచేయని వారిని క్షమించము. రానున్నది వర్షాకాలం ఎప్పటికప్పుడు మురికి కాలువలు శుభ్రం చేయాలి. గ్రామాలలో విచారణ జరిపి వారిని సస్పెండ్ చేస్తాం. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో నోటీసులు ఇచ్చి సస్పెన్షన్ చేశాము.

– సురేష్ మోహన్, డీపీఓ

ఆరు నెలలకోసారి కాల్వలు శుభ్రం చేస్తున్నారు

ఆరు నెలలకోసారి మురుగు కాల్వలను శుభ్రం చేస్తున్నారు. మురుగు కారణంగా ఈగలు, దోమలు బెడద ఎక్కువగా ఉంది. పంచాయతీ కార్యదర్శికి చెబితే సరైన సమాధానం ఇవ్వడంలేదు. సర్పంచ్ అందుబాటులో ఉండడు. మా సమస్యలు ఎవరికీ చెప్పుకోవాలి.

– నారాయణ, సంగారెడ్డి

క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. సోమవారం ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌లో 23 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 21 మందికి ఒకొక్కరికి రూ.2 వేల చొప్పున, మరో ఇద్దరికి రూ.3 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు తెలిపారు.

కొండపాకలో 23 మందికి..

కొండపాక(గజ్వేల్‌): మద్యం తాగి వాహనాలు నడిపిన మందుబాబులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. త్రీ టౌన్‌ సీఐ భానుప్రకాశ్‌ తెలిపిన వివరాల ప్రకారం..త్రీ టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఇటీవల వాహనాల తనిఖీలు, డ్రంకెన్‌ డ్రైవ్‌ నిర్వహించగా 10 మంది మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని పట్టుకున్నట్టు ఆయన చెప్పారు. వారిని కోర్టులో హాజరు పరచగా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి రమేష్‌బాబు 10 మందికి జరిమానాతో పాటు ఒకరికి ఒక్క రోజు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

వీఓఏల అరెస్ట్‌

చిన్నకోడూరు(సిద్దిపేట): వీఓఏల సమస్యల పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ చేపట్టిన సమ్మెలో భాగంగా సోమవారం చలో హైదరాబాద్‌ చేపట్టారు. చిన్నకోడూరు నుంచి వీఓఏలు హైదరాబాద్‌కు వెళ్తుండగా పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

వ్యక్తి రిమాండ్‌

పాపన్నపేట(మెదక్‌): విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్ట్‌ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ విజయకుమార్‌ తెలిపారు. దౌలాపూర్‌ గ్రామానికి చెందిన వడ్ల లింగం పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లపై దురుసుగా ప్రవర్తిస్తూ వారి విధులకు ఆటంకం కలిగించాడని.. అతడిపై గతంలో సైతం పలు కేసులు ఉండడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

‘ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు’

బెజ్జంకి(సిద్దిపేట): వరి ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిశాని రామచంద్రం ఆరోపించారు. బెజ్జంకిలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులు ఆరుగాలం పండించిన పంటలో చీడపీడలు పోను మిగిలిన ధాన్యం అమ్ముకోలేని దుస్థితి మన రాష్ట్రంలో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జి బాలయ్య, అసెంబ్లీ అధ్యక్షుడు బొనగిరి ప్రభాకర్‌, ప్రధాన కార్యదర్శి రాజమల్లు, మండల అధ్యక్షుడు తిరుపతి, కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 17 మంది ఎంపిక

సిద్దిపేటఎడ్యుకేషన్‌: సిద్దిపేట ప్రభుత్వ బాలుర జూనియర్‌ కళాశాలలో ఎంఎస్‌ఎన్‌ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఇంటర్‌ ఎంపీసీ, బైపీసీ పూర్తి చేసుకున్న విద్యార్థులు హాజరయ్యారు. వైస్‌ ప్రిన్సిపల్‌ చెన్నూరి శ్రీనివాస్‌ కంపనీ ప్రతినిధులు బ్రహ్మారెడ్డి, విజయ్‌, జయప్రకాశ్‌నారాయణ రాతపరీక్షను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఇంటర్మీడియట్‌ కెమిస్ట్రీ సబ్జెక్ట్‌తో పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఇది చక్కని అవకాశమన్నారు. ఇంటర్వ్యూల అనంతరం 15మంది బాలుర, ఇద్దరు బాలికలను ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కంపనీ ప్రతినిధి మోహన్‌ చెప్పారు.

సరిహద్దులో చెక్‌పోస్ట్‌

జహీరాబాద్‌: రాష్ట్ర సరిహద్దు వద్ద వ్యవసాయ శాఖ, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో చెక్‌పోస్ట్‌ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోకి నకిలీ విత్తనాలు రాకుండా ఉండేందుకుగాను ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి నకిలీ విత్తనాలు వచ్చే అవకాశం ఉందనే అనుమానంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొగుడంపల్లి మండలం మాడ్గి వద్ద ప్రత్యేక చెక్‌పోస్ట్‌ ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. సోమవారం చెక్‌పోస్టు పనితీరును డీఎస్పీ రఘు పరిశీలించారు. చిరాగ్‌పల్లి ఎస్‌ఐ కాశీనాథ్‌, మొగుడంపల్లి మండల ఏఓ వినోద్‌కుమార్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారు.



రాష్ట్ర సరిహద్దులో వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు

సోయాబీన్‌ విత్తనాల సీజ్‌

అక్రమంగా నిల్వచేసిన 200 సోయాబీన్‌ బస్తాలను వ్యవసాయశాఖ, పోలీసు అధికారులు సోమవారం సీజ్‌ చేశారు. చిరాగ్‌పల్లి ఎస్‌ఐ కాశీనాథ్‌, మండల వ్యవసాయాధికారి వినోద్‌కుమార్‌ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మొగుడంపల్లి మండలం ధనాసిరి గ్రామంలో ఒగ్గి సిద్ధన్న తన ఇంట్లో అనధికారికంగా హీరామోతి కంపెనీకి చెందిన సోయాబీన్‌ విత్తనాలు నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు అతడి ఇంటిలో సోదాలు చేసి విత్తనాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అనంతరం వారు మాట్లాడారు. ఎవరైనా అనధికారికంగా విత్తనాలను అధిక మొత్తంలో నిల్వచేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.



విత్తనాలను సీజ్‌ చేస్తున్న ఎస్‌ఐ కాశీనాథ్‌, ఏఓ వినోద్‌కుమార్‌



వశిష్ట పరంపర ఆధ్యాత్మిక ట్రస్ట్‌ (గోకులాశ్రమం)

గోకులాశ్రమాన్ని రక్షించండి

ట్రస్ట్‌ వ్యవస్థాపకుడు మధుసూదనరావు

సిద్దిపేటఅర్బన్‌: ప్రజలకు మంచి చేయాలనే ఆలోచనతో ట్రస్టును ఏర్పాటు చేసి క్రియ యోగా, ధ్యానం, ధర్మ మార్గాలను బోధిస్తున్న తమపై గ్రామస్తులు కొందరు దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని, ఆశ్రమ స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారని వెల్కటూరు గ్రామంలోని వశిష్ఠ పరంపర ఆధ్యాత్మిక ట్రస్ట్‌ (గోకులాశ్రమం) వ్యవస్థాపకులు యద్దనపూడి మధుసూదనరావు అన్నారు. సోమవారం ఆశ్రమంలో ఆయన మాట్లాడుతూ గోకులాశ్రమం ఆస్తులను కాపాడాలనే ఉద్దేశ్యంతో ఈ నెల 14 అర్ధరాత్రి నుంచి ఆశ్రమంలోనే అమరణ నిరాహార దీక్షకు దిగగా స్థానిక నాయకులు సమస్య పరిష్కరిస్తామని నచ్చజెప్పి వారి చేత దీక్ష విరమింపచేసినట్టు తెలిపారు. వారు ఇచ్చిన హామీ నెరవేర్చే వరకు ఒకే పూట ఆహారం తీసుకుంటూ 17 రోజులుగా దీక్ష కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగాలు వదిలిపెట్టి భార్య సరళతో కలిసి వెలకటూరులో 2012లో ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు సేవ చేస్తున్నామని, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆశ్రమం ఏర్పాటు చేసే సమయంలో ఆశ్రమ స్థలంలోనే వీరభద్రస్వామి రాతి ప్రతిమ చెట్టు కింద ఉందని, ఆశ్రమంతో పాటు ఆలయ జీర్ణోద్ధరణ చేసినట్టు తెలిపారు. ఆశ్రమం, గుడి ఎదుట ఉన్న ఖాళీ స్థలాన్ని కలిపి ప్రహరీ నిర్మించి, గేటు పెట్టడానికి ప్రయత్నించగా గ్రామస్తులు కొందరు అడ్డుకున్నారని, ఆశ్రమం విడిచి వెళ్లాలని బెదిరించినట్టు తెలిపారు. ట్రస్టుగా ఏర్పాటు సమయంలో నలుగురు వ్యక్తులను ధర్మకర్తలుగా ఎన్నుకున్నామని, వారు చేసిన అక్రమాలు తెలియగా, వారిని రాజీనామా చేయించి బయటకు పంపివేశామన్నారు. దీంతో కోపం పెంచుకున్న సదరు వ్యక్తులు ఆశ్రమాన్ని వారి చేతుల్లోకి తీసుకోవాలనే ఉద్దేశ్యంతో మరి కొందరితో కలిసి దౌర్జన్యానికి దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీస్‌ స్టేషన్‌లో ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, కలెక్టర్‌ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. అధికారులు, నాయకులు స్పందించి ఆశ్రమాన్ని కాపాడాలని కోరారు.



ఆశ్రమ వ్యవస్థాపకులు మధుసూదనరావు దంపతులు

విత్తన దుకాణాల్లో తనిఖీలు

కంగ్టి(నారాయణఖేడ్‌): వ్యవసాయశాఖ అధికారులు విత్తనాలు, పురుగుమందుల దుకాణాలపై తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లాలో ఇటీవల పెద్ద సంఖ్యలో సీడ్స్‌ అండ్‌ ఫర్టిలైజర్స్‌ దుకాణాల కుంభకోణాలు వెలుగుచూడడంతో అటు వ్యవసాయశాఖ అధికారులతో పాటు వ్యాపారులు సైతం అప్రమత్తమయ్యారు. మండల కేంద్రం కంగ్టితో పాటు తడ్కల్‌లోని పలు దుకాణాల్లో రిజిష్టర్‌లు, గోదాముల్లో స్టాక్‌ను టాస్క్‌ ఫోర్స్‌ టీం అధికారులు పరిశీలించారు. ఎప్పటికప్పుడు రికార్డులు అప్‌డేట్‌ ఉండాలని ఏడీఏ అంబిక డీలర్లకు సూచించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన విత్తనాలు, గ్లెసిల్‌ బీటీ2 పత్తి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం నారాయణఖేడ్‌ ఎస్‌ఐ రాములుతో పాటు నిర్వహించిన తనిఖీల్లో ఏఈఓలు సంధ్యారాణి, సంతోష్‌కుమార్‌ పాల్గొన్నారు.



తడ్కల్‌లోని ఓ విత్తన దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

భార్య మృతికి కారణమైన భర్తకు జైలు

సిద్దిపేటకమాన్‌: భార్య మృతికి కారణమైన భర్తకు సిద్దిపేట కోర్టు 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు, రూ.1000 జరిమానా విధించింది. సిద్దిపేట టూ టౌన్‌ సీఐ రవికుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం..నాందేడ్‌కు చెందిన వాగమరే మాధవ్‌(40) సిద్దిపేట పట్టణం, వడ్డెర కాలనీలో నివాసం ఉంటున్నాడు. మాధవ్‌కు 2013లో అదే ప్రాంతానికి చెందిన వాంగ్‌ మారే రాధతో వివాహం జరిగింది. వీరికి రెండున్నర సంవత్సరాల కుమారుడు కలడు. ఐదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం నాందేడ్‌ నుంచి సిద్దిపేట పట్టణానికి వచ్చి లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. కాగా మాధవ్‌ రోజు మద్యం తాగి ఇంట్లో భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో 2018 ఆగస్టు 22వ తేదీన మాధవ్‌ మద్యం సేవించి భార్యతో గొడవపడి ఆమెను తీవ్రంగా కొట్టడంతో రాధ మృతి చెందింది. తన కూతురి మృతికి అల్లుడు మాధవ్‌ కారణమని మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ సాంబయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్‌ రిమాండ్‌కు పంపించారు. సిద్దిపేట జిల్లా ప్రిన్సిపల్‌ డిస్ట్రిక్ట్‌ సెషన్స్‌ కోర్టులో కేసు విచారణ అనంతరం నిందితుడిపై నేరం రుజువైనందునా జడ్జి రఘురాం అతనికి10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించారు. పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ వెంకటలింగం, టూ టౌన్‌ సీఐ రవికుమార్‌, కోర్టు కానిస్టేబుల్‌ యాదగిరి, కోర్టు లైజనింగ్‌ ఏఎస్‌ఐ స్వామిదాస్‌లను సీపీ శ్వేత అభినందించారు.

ఇంటి తాళం పగులగొట్టి చోరీ

నగలు, నగదు ఎత్తుకెళ్లిన దొంగలు

జహీరాబాద్‌ టౌన్‌: జహీరాబాద్‌ పట్టణంలోని డ్రీమ్‌ వ్యాలీ కాలనీలో సోమవారం తెల్లవారు జామున ఓ ఇంటిలో చోరీ జరిగింది. ఇంటి తలుపు తాళాలను పగుల గొట్టి దొంగలు నగలు, నగదును ఎత్తుకెళ్లారు. జహీరాబాద్‌ టౌన్‌ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ సమీపంలో మహీంద్ర అండ్‌ మహీంద్ర కర్మాగారంలో ఉద్యోగం చేస్తున్న రఘుప్రసాద్‌ పట్టణంలోని డ్రీమ్‌ వ్యాలీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. శుభకార్యం కోసం రఘు ప్రసాద్‌ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌ వెళ్లారు. దొంగలు తెల్లవారు జామున తాళాలు పగుల గొట్టి ఇంటిలోకి ప్రవేశించారు. బీరువా తాళం కూడా పగుల గొట్టి అందులో దాచుకున్న 15 తులాల బంగారం, రూ. 20 వేల నగదు, 30 తులాల వెండి ఎత్తుకెళ్లారు. సీసీ ఫుటేజీలో చోరీ దృశ్యాలు నమోదయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు జహీరాబాద్‌ టౌన్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బెడ్‌పై చిందరవందరగా వస్తువులు

ఇద్దరి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్‌: ముత్తూట్‌ ఫైనాన్స్‌ సెక్యూరిటీ గార్డ్‌ అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ దుర్గయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రాపురం పరిధిలోని శ్రీనివాస్‌ నగర్‌ కాలనీకి చెందిన ప్రకాశ్‌(65) పటాన్‌చెరు ముత్తూట్‌ ఫైనాన్స్‌ బ్రాంచ్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 28వ తేదీ రాత్రి డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి తన ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి వెళ్లాడు. డ్యూటీకి వెళ్లిన ప్రకాష్‌ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతడికి ఫోన్‌ చేస్తే స్విచ్‌ ఆఫ్‌ వచ్చింది. వెంటనే భార్య లక్ష్మి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రకాష్‌ (ఫైల్‌)

పటాన్‌చెరులో యువతి..

పటాన్‌చెరు టౌన్‌: కూతురు అదృశ్యమైనట్లు ఓ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోమవారం పటాన్‌చెరు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం చిత్తూరుకి చెందిన సుశీల(22) బతుకుదెరువు కోసం వచ్చింది. బెల్‌లో ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో సుశీలకు వివాహం నిశ్చయమైంది. బంధువులకు శుభలేఖలు పంచేందుకు పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు ఈనెల 26వ తేదీన వచ్చింది. 27వ తేదీన పెద్దమ్మ శాంతమ్మ తో కలిసి సాయంత్రం 4 గంటల సమయంలో చిత్తూరు వెళ్లేందుకు ఇస్నాపూర్‌ నుంచి నడుచుకుంటూ వస్తుండగా సుశీల కనిపించలేదు. దీంతో శాంతమ్మ తన సోదరి పద్మకి ఫోన్‌ చేసి సుశీల కనిపించడం లేదని తెలిపింది. సుశీల కోసం స్థానికంగా తెలిసిన వారిని విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో కూతురు అదృశ్యంపై తల్లి పద్మ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

కోహీర్‌(జహీరాబాద్‌): మండలంలోని పర్వపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో పాడిగేదె మృత్యువాతపడింది. సోమవారం సాయంత్రం మేడి పండరి రైతుకు సంబంధించిన వ్యవసాయ బావి వద్ద చెట్టు కొమ్మ విరిగి విద్యుత్‌ తీగపై పడినట్లు గ్రామస్తులు తెలిపారు. మేత మేసేందుకు వెళ్లిన గేదె ప్రమాదవశాత్తు తీగను తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.



గేదె కళేబరం

ఇసుక మాఫియాను అడ్డుకోవాలి

ప్రజావాణిలో సర్పంచ్‌ ఫిర్యాదు

నంగునూరు(సిద్దిపేట): అర్ధరాత్రి పూట ఇష్టారీతిగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అక్కెనపల్లి సర్పంచ్‌ శ్రీమంతుల వెంకటేశం ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లినా అక్రమ రవాణా ఆగకపోవడంతో ప్రజావాణిలో ఫిర్యాదు చేశామన్నారు. మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ నాగేంద్రం, ఉప సర్పంచ్‌ సత్యనారాయణరెడ్డి, కర్ణాకర్‌, తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్‌, రైతులు

హలో నేను ఎస్‌ఐని మాట్లాడుతున్నా..

డబ్బులు పంపాలంటూ.. ఫోన్‌ కాల్స్‌

చేర్యాల(సిద్దిపేట): నేను ఎస్‌ఐని మాట్లాడుతున్నా.. డబ్బులు పంపండి అంటూ.. చేర్యాల, కొమురవెల్లి మండల పరిధిలోని పలు ఇంటర్నెట్‌, మినీబ్యాంక్‌ సెంటర్ల నిర్వాహకులకు రెండురోజులుగా గుర్తుతెలియని వ్యక్తి నుంచి వాట్సాప్‌ కాల్‌ రావడం చర్చనీయాంశమైంది. ఎస్‌ఐని అని చెప్పి డబ్బులు అడగడంతో ఆయా కేంద్రాల నిర్వాహకులు ఆందోళనకు గురవుతున్నారు. బాధితులకు 8639214082 సెల్‌నంబర్‌ నుంచి వాట్సాప్‌ కాల్‌ చేసినట్లు వాట్సాప్‌ డీపీలో సదరు వ్యక్తి ఫొటో పోలీస్‌ డ్రెస్‌లో ఉందని తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ఏడుగురికి గాయాలు

కౌడిపల్లి(నర్సాపూర్‌): రోడ్డుప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి సోమవారం తెలిపారు. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం రాలకత్వ గ్రామానికి చెందిన బయానా మహేశ్‌(30) కౌడిపల్లిలో భార్య రాణిని తీసుకువచ్చేందుకు ఆదివారం సాయంత్రం వెళ్లి తిరిగి రాత్రి తన బైక్‌పై వెలుతున్నాడు. 765డి జాతీయ రహదారిపై నాగ్సాన్‌పల్లి అటవీప్రాంతంలోని హనుమాన్‌ ఆలయం సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కారు, బైక్‌ ఢీకొన్నాయి. మహేశ్‌కు తీవ్రగాయాలవ్వడంతో నర్సాపూర్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో సంగారెడ్డి ఆసుపత్రికి పంపించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. మృతుని తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మహేశ్‌ మృతదేహం

ఇద్దరికి గాయాలు

కల్హేర్‌(నారాయణఖేడ్‌): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. కల్హేర్‌ ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్‌ కథనం ప్రకారం..కామారెడ్డి జిల్లా బ్రహ్మణపల్లికి చెందిన హన్మండ్లు, శ్రీనివాస్‌ మోటర్‌ సైకిల్‌పై సోమవారం బాచేపల్లి నుంచి ఇంటికి వెళుతుండగా ఇందిరానగర్‌ తండాకు చెందిన ఆక్మీరా శ్రీకాంత్‌ బైక్‌పై ఎదురుగా వచ్చి మాసాన్‌పల్లి చౌరస్తా సమీపంలో ఢీకొట్టాడు. దీంతో హన్మండ్లు, శ్రీనివాస్‌లకు గాయాలయ్యాయి. బందరి అవినాష్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ అదుపుతప్పి యువకుడు..

మనోహరాబాద్‌(తూప్రాన్‌): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మనోహరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. శివ్వంపేట్‌ మండలం దొంతి గ్రామానికి చెందిన బాలగారి భాస్కర్‌(21), శభాష్‌పల్లి గ్రామానికి చెందిన పాసగారి నరేష్‌లు ఆదివారం తమ బైక్‌పై జీడిపల్లి వద్ద ఐటీసీ పరిశ్రమలో పని చేయడానికి వెళ్లారు. విధులు ముగిసిన తర్వాత మేడ్చల్‌ మండలంలోని డబిల్‌పూర్‌లో కాంట్రాక్టర్‌ సాయిని కలవడానికి వెళ్లి రాత్రి ఇంటికి బైక్‌పై వస్తుండగా కాళ్లకల్‌ వద్దకు రాగానే రోడ్డు పక్కన ఉన్న సిమెంట్‌ దిమ్మను వేగంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో భాస్కర్‌ అక్కడిక్కడే మృతి చెందగా నరేష్‌కు కాలు, చేయి విరిగాయి. గమనించిన స్థానికులు అతనిని కొంపల్లి ఆస్పత్రికి తరలించారు. భాస్కర్‌ మృతితో దొంతిలో విషాదచాయలు అలుముకున్నాయి.



భాస్కర్‌ (ఫైల్‌)

ఆటో బోల్తా: పలువురికి గాయాలు

సిద్దిపేటరూరల్‌: ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి పలువురికి గాయాలైన ఘటన మండల పరిధిలోని రావురూకుల వద్ద సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం..నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొంది గ్రామానికి కొందరు దుబ్బాక మండల పరిధిలోని హబ్సీపూర్‌లో ఓ వేడుకకు వెళ్లారు. సాయంత్రం ఆటోలో గుర్రాలగొంది గ్రామానికి తిరిగి వస్తున్నారు. రావురూకుల గ్రామం వద్దకు రాగానే ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న బక్కలింగయ్య, దుర్గయ్య, జ్యోతి, భాగ్య మరో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడ్డవారిని స్థానికులు 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి

సిద్దిపేటఅర్బన్‌: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. సిద్దిపేట త్రీటౌన్‌ సీఐ భానుప్రకాష్‌ వివరాల ప్రకారం.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన సూకల రాంరెడ్డి భార్య జ్యోతితో కలిసి ఆదివారం సిద్దిపేట రూరల్‌ మండలం పుల్లూరు గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి వెళ్తుండగా కమిషనరేట్‌ సమీపంలో రాజీవ్‌ రహదారిపై వెనక నుంచి వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన రాంరెడ్డి పక్కటెముకలు విరిగిపోగా, చేతులు, కాళ్లకు, జ్యోతికి కంటికి, చేతులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాంరెడ్డి మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి ఆత్మహత్య

క్షణికావేశంలో బాలిక..

కొమురవెల్లి(సిద్దిపేట): క్షణికావేశంలో ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్‌ యాదవ్‌ తెలిపిన వివరాల ప్రకారం..మండల కేంద్రానికి చెందిన పొట్ల చెరువు మల్లేశంకు ఒక కూతురు సంధ్య(14), కుమారుడు మహేశ్‌ ఉన్నారు. తల్లి దండ్రులు ఇద్దరు పనికి వెళ్లిన తర్వాత అల్మారలోని బట్టలు సర్దే విషయంలో అక్క, తమ్ముడు గొడవపడ్డారు. అనంతరం తమ్ముడు మహేష్‌ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోవడంతో ఆ బాలిక క్షణికావేశంలో తన చున్నితో ఇంట్లో సజ్జకు ఉరివేసుకుంది. ఇంతలోనే పనులు ముగించుకొని ఇంటికొచ్చిన తల్లి తలుపులు వేసి ఉండడంతో కిటికిలోనుంచి తొంగి చూడగా తన కూతురు ఉరివేసుకొని కనిపించింది. ఆందోళనకు గురైన తల్లి చుట్టువక్కల వారిని పిలిచింది. వారొచ్చి తలుపులు పగలగొట్టి చూశారు. అప్పటికే సంధ్య మృతి చెందిందని వారు నిర్ధారించుకున్నారు. వెంటనే స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో తండ్రి మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..

మనోహరాబాద్‌(తూప్రాన్‌): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మనోహరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్‌ మండలం దీపాయంపల్లికి చెందిన మన్నూరి యాదగిరి (40) మొదటి భార్య అనారోగ్యంతో చనిపోవడంతో మండలంలోని లింగారెడ్డిపేటకు చెందిన రాణిని రెండో వివాహం చేసుకున్నాడు. సొంత ఊరిలో పనులు లేకపోవడంతో అత్తగారి ఊరైన లింగారెడ్డిపేటకు వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కాగా కొన్ని రోజులుగా ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కూతురు ప్రవీణ గమనించి తల్లికి, చుట్టుపక్కల వారికి చెప్పడంతో వారు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు.



యాదగిరి (ఫైల్‌)

తండ్రి మందలించాడని..


మనోహరాబాద్‌(తూప్రాన్‌): మద్యానికి బానిస కావొద్దని తండ్రి మందలించడంతో కుమారుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈసంఘటన మండల పరిధిలో సోమవారం జరిగింది. కామారెడ్డి రైల్వే ఎస్‌ఐ తావునాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామాయపల్లికి చెందిన సర్పంచ్‌ రావెల్లి పార్వతి మల్లేశ్‌ల కుమారుడు రావెల్లి భాస్కర్‌ (21) స్థానిక పరిశ్రమలో పనిచేస్తున్నాడు. 15 రోజుల క్రితం తన బాబాయ్‌ గుండెపోటుతో మృతి చెందడంతో అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఇదే విషయమై తల్లిదండ్రులు కుమారుడిని ఆదివారం రాత్రి మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన భాస్కర్‌ సోమవారం ఉదయం మండలంలోని పాలాట వద్ద ట్రైన్‌కు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి రైల్వే ఆస్పత్రికి తరలించారు.



భాస్కర్‌ (ఫైల్‌)

చెరువులో పడి..

వేగుంట(తూప్రాన్‌): చెరువులో పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రెడ్డిపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నార్సింగి గ్రామానికి చెందిన ఉప్పల శరత్‌(45)కు తూప్రాన్‌ మండలంలోని తాతపాపన్‌పల్లి గ్రామానికి చెందిన లక్ష్మితో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. శరత్‌తో విభేదాలు రావడంతో భార్యాపిల్లలు పుట్టింటికి వెళ్లిపోయారు. దీంతో శరత్‌ రెడ్డిపల్లిలో తన తల్లి లక్ష్మమ్మతో కలిసి ఉంటూ కూలీపనులు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం తల్లితో గొడవపడి బయటకు వెళ్లిపోయాడు. దీంతో శరత్‌ కోసం వెతుకుతున్నారు. ఈ క్రమంలో సోమవారం స్థానిక చెరువులో మృతదేహం తేలడంతో బయటకు తీయగా మృతుడు శరత్‌గా గుర్తించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్‌ తెలిపారు.



శరత్‌ మృతదేహం